క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల్లో లోపాలు లేకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో లోపాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని ఆరోవ వార్డులో శనివారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 8వ వార్డు నాజర్‌పేటలోని దుర్గాప్రసాద్ వీధిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రూ.7.50లక్షలతో నిర్మాణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ఫణీంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, కాంట్రాక్టర్ పాటిబండ్ల గోపి పాల్గొన్నారు.

6న ఎమ్మార్పీఎస్ జిల్లా సమీక్ష

తెనాలిరూరల్: ఎమ్మార్పీఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా సమీక్ష సమావేశాన్ని ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో కన్వీనర్ కొవెరపు కోటేశ్వరరావు మాదిగ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపేటలోని ఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగే సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

గోవాడ క్రియేషన్స్ నాటిక రచనల పోటీల్లో విజేతలు

తెనాలి: గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన గోవాడ మల్లీశ్వరి స్మారక నాటిక రచనల పోటీల–2024 విజేతలను శనివారం ప్రకటించారు. అమ్మ కాన్సెప్టుతో నిర్వహించిన ఈ పోటీల్లో రావి నాగేశ్వరరావు రచించిన 'తాయి' నాటిక ప్రథమ బహుమతిని గెలుచుకుంది. జ్యోతిరాజ్ భీశెట్టి రచన 'అమ్మ చెక్కిన బొమ్మ' ద్వితీయ బహుమతి, నల్లా సత్యనారాయణబాబు రచన 'శ్రీ' నాటిక తృతీయ బహుమతికి ఎంపికైనట్లు ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకట్ గోవాడ తెలియజేశారు. డాక్టర్ బొక్కా శ్రీనివాసరావు రచన 'ఆకారం ఏకమ్–మకార ద్వయమ్', వంశీకృష్ణ పరిమళ నాటిక 'పిచ్చి శంభవ్వ', ఎం.అరుణ్‌బాబు రచన 'అమ్మకు పట్టాభిషేకం', ఎంవీఎల్ఎస్ సరస్వతి రచన 'విలువ' నాటిక, పాణ్యం దత్త శర్మ రాసిన 'కుమాతా నభవతి' నాటికలు ప్రశంసా బహుమతులకు ఎంపికైనట్టు వివరించారు. విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలకు పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బీహెచ్ పద్మప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్ బీహెచ్ కల్యాణి, నాటక రంగ పరిశోధకురాలు డాక్టర్ సమ్మెట విజయ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

కాలుష్య రహిత దేశంగా భూటాన్

ఏఎన్‌యూ: ప్రపంచంలో కాలుష్య రహిత దేశంగా భూటాన్ ఉందని, అక్కడ 70 శాతం అటవీ ప్రాంతం ఉందని అస్సాం అంగ్రికల్చర్ యూనివర్సిటీ అధ్యాపకుడు ప్రొఫెసర్ ఎల్లా రత్తయ్య తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో 'ట్రీస్ విస్ గ్లోబల్ వార్మింగ్ అండ్ క్లైమేట్ చేంజ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఆచార్య రత్తయ్య ప్రసంగిస్తూ గ్లోబల్ వార్మింగ్ అనేది సీవో–2లో మార్పులు పెరగటం వల్ల వస్తుందన్నారు. ప్రస్తుతం కార్బన్ ఫుట్ ప్రింట్స్ వల్ల కార్బన్ డయాక్సైడ్ తగ్గించవచ్చని తెలిపారు. అమెరికా అధికంగా గ్లోబల్ వార్మింగ్‌కి కారణం అవుతోందని వెల్లడించారు. 2070కి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెట్ జీరో లేదా సీవో–2 పొల్యూషన్ రహిత దేశంగా భారతదేశాన్ని నిలిపేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో జపాన్‌కి చెందిన అకిరా మియా వకీ మెథడ్‌ని అనుసరించి తాను ఎక్కువ లేయర్స్ రకాలైన మొక్కలను గుంటూరులోని కొరిటెపాడు ట్యాంక్, వాకింగ్ ట్రాక్‌లో ఏర్పాటు చేయించానని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ గంగాధరరావు మాట్లాడుతూ మొక్కల పెంపకంలో ఆచార్య రత్తయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య పాల్గొన్నారు.

తెనాలిలో

వీధి కుక్కల స్వైర విహారం



- బెంబేలెత్తుతున్న ప్రజలు.
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు.



బాలాజీరావుపేటలో తిరుగుతున్న వీధి కుక్కలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. కుక్కలు ప్రజలపై దాడులు చేస్తుండటంతో...ఆందోళనకు గురవుతున్నారు. గతంలో వీధి కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని ఇతర ప్రాంతాలలో వదిలేసి వచ్చేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేకపోవటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తెనాలి పట్టణంలో మున్సిపల్ సిబ్బంది గతంలో చేసిన సర్వే ప్రకారం 775 వీధి కుక్కలు ఉన్నట్లు నిర్ధారించారు. వాటిలో 772 కుక్కలను పట్టుకుని బుర్రిపాలెం రోడ్డులోని కుక్కల శస్త్ర చికిత్సాలయంలో పిల్లలు పుట్టకుండా శస్త్ర చికిత్సలు చేసి వాటిని పట్టుకున్న ప్రాంతంలోనే వదిలేశారు. ఇటీవల మున్సిపల్ సిబ్బంది జరిపిన సర్వేలు శస్త్ర చికిత్సలు చేయని వీధికుక్కలు మరో 650 ఉన్నట్లు గుర్తించారు. మున్సిపల్ సిబ్బంది ప్రధాన వీధులలో మినహా మిగిలిన చిన్న, చిన్న రోడ్లలోని కుక్కలు, వాటి పిల్లలను లెక్కల నుంచి వదిలేశారు. ఇవి కూడ దాదాపు వందల సంఖ్యలోనే ఉండవచ్చని సమాచారం. ఇవి కాకుండా పెంపుడు కుక్కలు కూడా వందల సంఖ్యలోనే ఉంటాయి. దీనిని బట్టి చూస్తే తెనాలి పట్టణంలోని దాదాపు అన్ని ప్రాంతాలలో కుక్కల సంఖ్య వందలలోనే ఉన్నట్లు భావించవచ్చు.

రోజుకు 15 నుంచి 20 మందిపై దాడి

పట్టణంలోని వీధి కుక్కలు పాదచారులు, వాహనదారులపై తరచూ దాడులు చేస్తున్నాయి. ఈ విషయాన్ని జిల్లా వైద్యశాలలోని గణంకాలు నిర్ధారిస్తున్నాయి. ప్రతిరోజూ కుక్కకాటుకు గురై తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చి ఇంజక్షన్లు చేయించుకునే వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటుంది. దీనిని బట్టి చూస్తే నెలకు సుమారు 500 నుంచి 600 మంది వరకు వీటి బారిన పడుతున్నట్లు మనకు అర్థమౌతుంది. అయితే కుక్క కాటు ఇంజక్షన్‌లు ప్రభుత్వ వైద్యశాలలో కావాల్సిన మేరకు అందుబాటులో ఉండటం వల్ల గాయపడిన వెంటనే చికిత్స పొందుతున్నారు.

కన్పించని చర్యలు.

గతంలో మున్సిపల్ అధికారులు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందితో వాటిని పట్టుకునే వారు. వాటిని దూర ప్రాంతాలలో వదిలేసి వచ్చే వారు. కానీ నేడు ఆ పరిస్థితి కన్పించటం లేదు. మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకుని వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసి వదిలేస్తున్నారు. దీంతో అవి అక్కడే తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. ఇటీవల నాజరుపేట, మారీసుపేట శివాలయం వీధి, నందులపేట, బాలాజీరావుపేట, చెంచుపేటలలో ఎక్కువగా వాహనదారులు, పాదచారుల వెంట పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో అయితే దాడులకు అవి తెగబడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వీధి కుక్కల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



పట్టణంలో వీధి కుక్కలు కన్పిస్తే వెంటనే మాకు తెలియజేయండి. వాటిని ప్రత్యేక సిబ్బందితో పట్టించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేసి పట్టుకున్న ప్రాంతంలో వదిలేస్తాం. అదే పిచ్చి కుక్కలు అయితే వెటర్నరీ అధికారుల సూచనల మేరకు వాటిపై చర్యలు తీసుకుంటాం.

– బండి శేషన్న,
కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

భారీగా బంగారం అపహరణ

- చెంచుపేటలోని అపార్ట్‌మెంట్‌లో చోరీ
- వివరాలు వెల్లడించని పోలీసులు



తెరచి ఉన్న బీరువా తలుపులు

తెనాలిరూరల్: స్థానిక చెంచుపేట ఈద్గా సమీపంలో గల మార్గ్ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో శుక్రవారం వెలుగులోకి వచ్చిన చోరీ ఘటనలో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌లోని సెకండ్ ఫ్లోర్‌లో ఉన్న బి–10 ఫ్లాట్‌లోకి చొరబడిన దుండగులు నగదు, బంగారు ఆభరణాలు, వెండి అపహరించుకు వెళ్లారు. ఈ ఫ్లాట్‌లో ఏవీవీఎస్ సుజాత అనే మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె భర్త నరసింహారావు మృతి చెందగా కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. ఐదు నెలల కిందట కుమారుని వద్దకు అమెరికా వెళ్లిన సుజాత గత ఆదివారమే తెనాలి వచ్చింది. బుధవారం రాత్రి తిరుమల వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని గమనించిన దుండగులు ఇనుప రాడ్డు సాయంతో తలుపు తాళాలు, డోర్ మెష్ తొలగించి లోనికి చొరబడినట్లు తెలుస్తోంది. ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురు చేయడంతో పాటు స్క్రూడ్రైవ్‌తో కబోర్డులు, బీరువా తలుపులు తెరిచి నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. కొన్ని వెండి వస్తువులు మాత్రం అక్కడే వదిలేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం వేరే పని నిమిత్తం ఫ్లాట్ వద్దకు వచ్చిన బంధువు వరుసైన మహిళ తలుపులు పగులకొట్టి ఉండటం చూసి చోరీ జరిగినట్లు నిర్ధారించారు. స్థానికులతోపాటు త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ ఫ్లాట్‌లో ఆధారాలు సేకరించే ప్రయత్నం చేసింది. ఫ్లాట్ యజమాని సుజాత అందుబాటులో లేకపోవడంతో ఎంత మొత్తంలో సొమ్ము, ఆభరణాలు చోరీకి గురయ్యాయన్నది తెలియరాలేదు. తిరుమల నుంచి సుజాత శనివారం తెల్లవారుజామున తెనాలి చేరుకున్నారు. త్రీ టౌన్ పోలీసులతో మాట్లాడి చోరీకి గురైన సొత్తు వివరాలు వెల్లడించారు. ఎంత సొత్తు చోరీకి గురైందన్న వివరాలు పోలీసులు వెల్లడించడం లేదు. 30 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేలకుపైగా నగదు, కొన్ని వెండి దిమ్మెలు అపహరించుకెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. చోరీ సొత్తు విలువ సుమారు రూ.18 లక్షల వరకు ఉండవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే అపార్ట్‌మెంట్‌లో 90కి పైగా ఫ్లాట్లు, వాచ్‌మెన్లు, నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉన్నప్పటికీ దొంగలు ఏ విధంగా లోనికి చొరబడి చోరీకి పాల్పడి ఉంటారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఇది బయటి వ్యక్తుల పనా లేక తెలిసిన వారే ఈ చోరీకి పాల్పడ్డారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. త్రీ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల ఇళ్ల నిర్మాణాలను పరిశీలించాలి

తెనాలిరూరల్: ప్రభుత్వం పేదలకు కట్టించిన ఇళ్ల నాణ్యత పరీక్షలు చేయించి తగు చర్యలు తీసుకోవాలని తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘ సభ్యులు కోరారు. స్థానిక కొత్తపేటలోని కార్యాలయంలో శనివారం ఉదయం నిర్వహించిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంపై మాట్లాడారు. గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు ఇచ్చే నిమిత్తం జగనన్న కాలనీల్లో జరిగిన నిర్మాణాలలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. పేదల ఇళ్లు నాణ్యత రహితంగా కట్టినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని వారు కోరారు. సమావేశంలో సంఘ నాయకులు దరిశి శివ కోటేశ్వరరావు, అబ్దుల్ ఆరీఫ్, నారాయణం కమల్‌కుమార్, అబ్రహం లింకన్, రావూరి శివ శంకరరావు, చెరుకూరి శివరామయ్య, కొల్లిపర చింపయ్య, కటారి వాసుదేవనాయుడు, ఎస్.నాగేశ్వర లింగం, యనమదల రమేష్‌బాబు, సాతులూరు రాజేష్, పోపూరి రామమోహన్‌రావు, వూలా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీల్లో 'ఆళ్ల'కు ద్వితీయ బహుమతి



తెనాలి: తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన సత్యశ్రీ సాహితీ మనోరచన వేదిక ఆధ్వర్యంలో ఇటీవల జీవన ప్రయాణం అనే అంశంపై ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన తెలుగు వచన కవితల పోటీలలో తెనాలికి చెందిన ఆళ్ల నాగేశ్వరరావు రాసి, వీడియోలో గానం చేసి పంపిన 'జీవన యానం' అనే కవితకు ద్వితీయ బహుమతికి ఎంపికైంది. ఈ ప్రకారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ముడుంబై రఘువరన్ ఆచార్యులు సమాచారం పంపినట్టు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆళ్ల నాగేశ్వరరావు వృత్తిరీత్యా గుంటూరు ఆర్టీసీ–2 డిపోలో కండక్టర్ గా విధులు నిర్వర్తిస్తూ, ప్రవృత్తిగా సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు.

ముగిసిన వివాదం

పూర్తయిన అక్రమణ తొలగింపు



జేసీబీతో షాపు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తెనాలిఅర్బన్: తెనాలి నందులపేటలోని పాల్గాద్రి కాల్వ వెంట ఉన్న షాపు తొలగింపు వివాదం శనివారంతో ముగిసింది. కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు మున్సిపల్ స్థలంలో ఏర్పాటు చేసిన షాపును జెసీబీతో తొలగించి ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారుల కథనం ప్రకారం పాల్గాద్రి కాల్వ ప్రక్కన ఉన్న మున్సిపల్ స్థలంలో నరేంద్రకుమార్ రేకుల షెడ్డును నిర్మించి వ్యాపారం చేసుకుంటున్నాడు. తమను ఆ స్థలంలో ఖాళీ చేయించి అతడు పూర్తిగా అక్రమించుకుని దుకాణం ఏర్పాటు చేశాడని స్థానికులు ఆరోపిస్తూ ఇటీవల ఆందోళన చేశారు. అంతేకాకుండా షాపులోని వస్తువులను ధ్వంసం చేశారు. ఆ సమయంలో మున్సిపల్, పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను శాంతిపచేసి కేసు కోర్టులో ఉన్నందున తీర్పు వచ్చే వరకు షాపును తెరవద్దని సూచించి తాళాలు వేశారు. అనంతరం కోర్టు తీర్పు మున్సిపల్ అధికారులకు అనుకూలంగా రావడంతో వారు స్థలాన్ని ఏడు రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు. అతడు ఖాళీ చేయకపోవడం, గడువు ముగియడంతో శనివారం పోలీసుల బందోబస్తు మధ్య షాపు తొలగించినట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ జడ్.సుధాకర్ తెలిపారు. అనంతరం అక్కడ ఇది మున్సిపల్ స్థలం అనే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు

గుంటూరు నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ



ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ హరికృష్ణ

నెహ్రూనగర్: తాగునీటి సరఫరా సమయంలో అశ్రద్ధ వద్దని, పరీక్షలు తప్పనిసరని నగర కమిషనర్ ఎస్.హరికృష్ణ చెప్పారు. ఎక్కడైనా కలుషిత నీటి సరఫరా జరిగితే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. శనివారం సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు నిత్యం తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడైనా తాగునీరు కలుషితం అయినట్లు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి కాలుష్యంపై అందే ఫిర్యాదుల్ని అధిక ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టం చేశారు.

పూడికతీతపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

అన్న క్యాంటీన్ల మరమ్మతు పనులపై రోజువారీ పురోగతి రిపోర్ట్ ఇవ్వాలని, సోమవారం నాటికి పూర్తిచేయాలని కమిషనర్ తెలిపారు. ప్రధాన అవుట్ ఫాల్ డ్రెయిన్‌లో పూడికతీత ఎక్కడైనా పెండింగ్ ఉంటే వెంటనే తీయించాలని చెప్పారు. సోమవారం నాటికి పూడికతీతపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నగరంలో ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్యం కీలకమని, ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని తెలిపారు. డివిజన్ల వారీగా మెరుగైన పారిశుద్ధ్యానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. విభాగాల వారీగా అర్జీ, దరఖాస్తుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఎస్ఈ. ఎం.శ్యాం సుందర్, అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచాలి

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ అధికారుల్ని ఆదేశించారు. డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, మేనేజర్ ప్రసాద్‌తో కలిసి శనివారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయాన్ని, పార్కింగ్ పనులను పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ జీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ఇతర కార్యాలయాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో కొంత మేర మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

సాగుకు సేంద్రియ పద్ధతులే మేలు

- రసాయన ఎరువుల వాడకంతో ఎన్నో అనర్థాలు
- భూమిలో పోషకాలు లోపిస్తే తగ్గిపోనున్న దిగుబడులు



సాగులో ఎదుర్కొన్న ఇబ్బందులను చిత్రాల ద్వారా రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

వల్లభాపురం(కొల్లిపర): వ్యవసాయ సాగులో రైతులు సేంద్రియ పద్ధతుల ద్వారా ఆర్గానిక్ ఎరువులు వాడటం వలన మేలైన దిగుబడులు సాధించటంతో పాటు ప్రతి ఒక్కరూ ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా వారి జీవన ప్రమాణం మెరుగుపడుతుందని వడ్డేశ్వరంలో కేఎల్ వ్యవసాయ కళాశాల 4వ సంవత్సరం విద్యార్థులు రైతులకు సూచించారు. గ్రామీణ పనులు అవగాహన–అనుభవ (ఆర్ఎడబ్ల్యుఈపి) కార్యక్రమంలో భాగంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్, కళాశాల హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో వల్లభాపురం గ్రామంలో వ్యవసాయ క్షేత్రాల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని నేర్చుకుంటూ శనివారం కళాశాల విలేజ్ ఇన్‌చార్జిలు డాక్టర్ బి.వి.ఎస్ కిరణ్, డాక్టర్ ఎం.ఉదయభాస్కర్, డాక్టర్ పి.అవినాష్ సహకారంతో శివాలయం ప్రాంగణ ఆవరణలో గ్రామ స్థితిగతులను సమగ్రంగా చిత్రపటాలు, విలేజ్ మ్యాప్, టైమ్‌లైన్, టైమ్‌ట్రెండ్, మొబైల్ టీమ్‌మ్యాపింగ్, వ్యవసాయ దిగుబడులు, సాగులో ఎదుర్కొన్న ఇబ్బందులు వంటివి రంగులతో చిత్రాలు రూపొందించి వాటి ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మాట్లాడుతూ నేటి యుగంలో ఎక్కువ శాతం పంటలలో రసాయన ఎరువులు వాడటం వలన ఫలితంగా భూముల్లో పంటలకు కావలసిన పోషకాలు అందుబాటులో లేక సమతుల్యత లోపించి ముందెన్నడూ లేని విధంగా భూమిలో ద్వితీయ సూక్ష్మ పోషక లోపాలు పంటలల్లో కనిపించి, కొత్త రకం తెగులు వచ్చి దిగుబడి తగ్గుతున్నాయని కావున ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం ద్వారా సాగు చేయాలి కోరారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు కె.ప్రవీణ్‌కుమార్, ఎ.దీపక్, కె.అంజిరెడ్డి, కె.వి.ఆర్.ఎం.వంశీ, ఎన్.సాయిగణేష్ బాబు, సీహెచ్ సాయితరుణ్, ఎస్.మనోహర్‌రెడ్డి, జి.రవికిరణ్, సీహెచ్.షణ్ముఖ్‌నాథ్, జి.సాయితేజ, షేక్ మెహబూబ్‌సుభాని, రైతులు శశిధర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివాదాలకు తావులేకుండా ఎన్నికలు నిర్వహించండి

ఎంఈవోలు లక్ష్మీనారాయణ, జయంతిబాబు

తెనాలిఅర్బన్: వివాదాలకు తావు లేకుండా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించాలని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, జయంతిబాబులు సూచించారు. తెనాలి పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాల విద్యాకమిషనర్ ఆదేశాల మేరకు వర్క్ సర్దుబాటు జరుగుతున్నాయని తెలిపారు. ఉపాధ్యాయులందరూ యు డైస్ లాగిన్‌లో తమ సమాచారాలను ఎంటర్ చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులందరూ ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యే విధంగా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఈ నెల 8వ తేదీన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులు ఉండేలాగా ఎన్నుకోవాలన్నారు. చైర్మన్, వైస్‌చైర్మన్, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫిషియో సభ్యుల ఎన్నిక జరగాలని, 50 శాతం మంది తల్లిదండ్రులు పాల్గొనే విధంగా చూడాలన్నారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు టి.సీతారామయ్య, జి.శివపార్వతి, ఎం.నాగేశ్వరరావు, ఎస్.అనురాధ, పి.సరళ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఇండియన్ ఆర్గన్ డొనేషన్ డే సందర్భంగా జెఎంజె స్వధార్ హోంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే నేడు జీవన శైలిలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. సంపాదనతో పాటు ఆరోగ్యానికి కొంత సమయానికి కేటాయించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవడంతో పాటు శారీరక వ్యాయామం అవసరమన్నారు. ప్రతి అవయవాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. చెడు అలవాటులకు, వ్యసనాలకు బానిసలు కావద్దని, దానివలన ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సమావేశంలో స్వధార్ హోం నిర్వాహకులు అను లూయిస్, నిరాశ్రయులు పాల్గొన్నారు.

'ఖేల్–కూద్' పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలిరూరల్: స్థానిక సుల్తానాబాద్‌లోని నవోదయ కల్యాణ మండపంలో శిశు మందిర్ బాల బాలికల క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. శ్రీ సరస్వతి విద్యాపీఠం–విజయవాడ సమితి ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని సరస్వతి శిశు మందిర్ సౌజన్యంతో మధ్యాహ్నం ఖేల్ – కూద్ పేరిట జరిగిన కార్యక్రమంలో శిశు మందిర్ బాల బాలికలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమితి కార్యదర్శి కొడూరు రమాదేవి నేతృత్వంలో శిశు మందిర్ ఉపాధ్యక్షులు పాత్తూరు నాగేంద్ర పరిచయ కార్యక్రమం చేశారు. ప్రాంత సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్, శ్రీ సరస్వతి విద్యాపీఠం విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్, విశ్రాంత ఫైర్ ఆఫీసర్ చిందు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అతిథులు, నిర్వాహకులు ప్రసంగిస్తూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు చేసిన పలు నృత్య ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. పోటీలు రెండు రోజులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అవగాహన సదస్సుల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఓఎస్డీ ఏసురత్నం

తెనాలిరూరల్: తెనాలి శాసనసభ్యుడు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గ పర్యటనల్లో నివేశన స్థలాలు, గృహ నిర్మాణాలకు సంబంధించి ప్రజల నుంచి పలు విన్నపాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నివేశన స్థలాల మంజూరు, ఇళ్ల నిర్మాణం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పెదరావూరు, సిరిపురం, దావులూరు లేఅవుట్లలో అవగాహన సదస్సులు ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు పెదరావూరు లేఅవుట్‌లో, మధ్యాహ్నం 3 గంటలకు సిరిపురం లేఅవుట్‌లో, సాయంత్రం 5 గంటలకు కొల్లిపర మండలం దావులూరు లేఅవుట్‌లో సదస్సులు జరుగుతాయి. మంత్రి మనోహర్ సదస్సుల్లో పాల్గొని స్వయంగా ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. ఈ సదస్సుల ఏర్పాట్లను మంత్రి ఓఎస్డీ ఎన్.ఏసురత్నం శనివారం పరిశీలించారు. ఎక్కడెక్కడ ఏ విధంగా ఏర్పాట్లు చేయాలన్నది అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. పట్టణ పరిధిలోని లబ్ధిదారులు పెదరావూరు, సిరిపురం లేఅవుట్‌లలో, కొల్లిపర మండలంలోని లబ్ధిదారులు దావులూరు లేఅవుట్‌లో జరగే సదస్సులకు రావాలని ఆయన సూచించారు. గృహనిర్మాణ, పురపాలక సంఘ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఓఎస్డీ వెంట తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, గృహనిర్మాణ శాఖ ఈఈ యడ్ల భాస్కరరావు, డీఈఈ రఫీవుల్లా ఖాన్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఏసీ బాక్స్ చోరీ

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వ కార్యాలయం బయట ఉన్న ఏసీ బాక్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్డీవో కార్యాలయం సమీపంలో గల ఎన్టీఆర్ విద్యా సేవ కార్యాలయం కిటికీ తొలగించి శుక్రవారం రాత్రి చోరీ చేశారు.